క్లుప్తంగా

క్షయపై అవగాహన

సఖినేటిపల్లి: క్షయ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా గురువారం గొంది గ్రామంలో రామేశ్వరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టీబీ రహిత భారత దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.రాజా పిలుపు నిచ్చారు. ఈ మేరకు మొబైల్ వ్యాన్ ద్వారా గ్రామంలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడుతూ, రెండు వారాలు మించి దగ్గు, ఆకలి మందగించడం, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే ఆరోగ్య సిబ్బందని సంప్రదించాలని కోరారు. వార్డు మెంబర్ డీ.నరసింహారావు, ఏఎస్ఎం బీ రత్న కుమారి, ఎంపీహెచ్ఏ ప్రేమ్‌కుమార్, 104 సిబ్బంది కే.మౌనిక, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పతకాలు



బాక్సింగ్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న అధ్యాపకులు

రాజోలు: 'అమరావతి ఛాంపియన్ షిప్ ట్రోఫీ' రాష్ట్రస్థాయిలో తిరుపతిలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు పలు పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ బి.సాయిబాబు గురువారం తెలిపారు. బి.మోహన్‌రాజ్ 71 కిలోల విభాగంలో వెండి పతకం, టి.సుధీర్ 48 కిలోల విభాగం, ఎం.స్వర్ణన్ రాజు 80 కేజీల విభాగాల్లో కాంస్య పతకాలు సాధించారని వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ టీఎస్‌వీ పద్మనాభం, స్పోర్ట్స్ ఇన్‌చార్జి ఎస్.రాజు, పీడీ బి.మధుకుమార్ క్రీడాకారులను అభినందించారు.

గొల్లపల్లి సూర్యారావు పరామర్శ



ఏసురత్నం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న గొల్లపల్లి

సఖినేటిపల్లి: అంతర్వేదికర గ్రామంలో గురువారం దైవజనులు కొల్లాబత్తుల ఏసురత్నం కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ రాజోలు ఇన్‌చార్జి గొల్లపల్లి సూర్యారావు పరామర్శించారు. ఏసురత్నం ఇటీవల దేవుని సన్నిధికి చేరుకున్నారు. కుటుంబ సభ్యులకు సానుభూతి ఆయన తెలిపారు. వెంట నాయకులు పాల్గొన్నారు.

ఇసుక నిల్వల పరిశీలన



జొన్నాడలో ఇసుక నిల్వలపై అధికారులను ఆరా తీస్తున్న ఆర్డీఓ శ్రీకర్

ఆలమూరు: మండలంలోని జొన్నాడ, ఆలమూరు గ్రామాల్లోనున్న ఇసుక నిల్వలను కొత్తపేట ఆర్డీఓ పి.శ్రీకర్ గురువారం పరిశీలించారు. ఇసుక సరఫరా చేస్తున్న విధానం, రుసుం వివరాలను వాహనదారులను అడిగి తెలుసుకున్నారు. ఇసుకను ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు మాత్రమే పారదర్శకంగా విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఇసుక నిల్వలపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలని ఆయన అధికారులను కోరారు. ఎంపీడీఓ ఏ రాజు, డిప్యూటీ తహసీల్దార్ టి.సుబ్బరాజు, సూపరింటెండెంట్ ఎ.మెహెర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

ఆలమూరు: చొప్పెల్లలోనిప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆర్డీఓ పి.శ్రీకర్ గురువారం ఆకస్మింగా తనిఖీ చేశారు. మండల పర్యటనలో భాగంగా మండల స్థాయి అధికారుల బృందంతో కలిసి పీహెచ్‌సీని పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలు, పారిశుద్ధ్య నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలను అందజేశారు. వైద్యాధికారులు ఎస్.లక్ష్మీస్నేహలత, బి.అనంత రామకృష్ణ, ఎంపీడీఓ ఏ రాజు, డిప్యూటీ తహసీల్దార్ టి.సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని యువకుడి మృతదేహం

రావులపాలెం: స్థానిక బండి రేవు పుంత పొలంలో గుర్తు తెలియని యువకుడి మృతదేహం ఉన్నట్టు సమాచారం అందడంతో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గద్దం సోమన్న, రాజేష్ తండ్రీ కొడుకులు కౌలుకు చేస్తున్న అరటి తోటలో సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన యువకుడి మృతదేహం ఉన్నట్టు రాజేష్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై జీ రమణారెడ్డి గురువారం తెలిపారు. మృతుడు సుమారు ఐదు అడుగుల 6 అంగుళాల పొడవు ఉండి, చర్మం కమిలిపోయి ఉందన్నారు. నీలిరంగు ఫుల్ హ్యాండ్ షర్టు ధరించి ఉన్నాడన్నారు. మృతదేహం వివరాలు తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ శేఖరబాబు కోరారు.

క్రీడాకారుల పురిటిగడ్డ కొత్తపేట

- బాలుర ఉన్నత పాఠశాలలో విశాలమైన క్రీడా మైదానం
- వివిధ ఆటల పోటీలకు నిలయం
- జాతీయ స్థాయిలో రాణించి ఉద్యోగాలు పొందిన క్రీడాకారులు
- నేడు జాతీయ క్రీడా దినోత్సవం



నాడు కొత్తపేటలో హాకీ విజేతలతో పీఈటీలు సలాది వెంకటస్వామి, నల్లా సత్యనారాయణమూర్తి (ఫైల్)



కొత్తపేటలో ఆడుదాం ఆంధ్రా ఖోఖో విజేతలతో పీడీ, పీఈటీలు (ఫైల్)

కొత్తపేట: క్రీడాకారులకు పురిటిగడ్డగా కొత్తపేట ఖ్యాతి పొందింది. క్రీడా పోటీలకు వేదికగా నిలిచింది. పూర్వపు తాలూకా కేంద్రం, ప్రస్తుత నియోజకవర్గ కేంద్రం అయిన ఇక్కడ జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించగా నాటి నుంచి నేటి వరకూ స్థానిక క్రీడాకారులు జాతీయ స్థాయిలో కూడా రాణించి ఈ గడ్డకు పేరు తెచ్చారు. నాటి పీఈటీలు స్థానిక క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడమే కాక, జిల్లా స్థాయిలో కోచ్‌లుగా కూడా వ్యవహరించారు. క్రీడాకారులుగా రాణించిన వారు ఎందరో పీఈటీ, పీడీలు ఉద్యోగాలు పొందారు. శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నాటి కొత్తపేట క్రీడా వైభవం.. పూర్వ క్రీడాకారులను గుర్తుచేసుకుందాం..

పెద్ద క్రీడా వైభవం

స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విశాలమైన క్రీడా మైదానం ఉంది. జిల్లాలోకెల్లా పెద్దది. ఇక్కడ సుమారు 75 సంవత్సరాలుగా వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. ఎంతో మంది క్రీడాకారులు ఇక్కడకు వచ్చి ప్రాక్టీస్ చేసేవారు. ఈ ప్రాంత పీఈటీలకు శిక్షణ ఇచ్చేవారు. వారిని జిల్లా, రాష్ట్ర స్థాయి టీమ్ సెలక్షన్స్ కూడా జరిగేవి.

గురువులకే గురువులు నాటి పీఈటీలు

1950 దశకం నుంచి కొత్తపేటలో క్రీడా వైభవం గురించి గుర్తు చేసుకుంటే ఈ మండల పరిసర గ్రామాలకు చెందిన పలువురు క్రీడాకారులు వివిధ క్రీడల్లో రాణించారు. వారిలో సలాది వెంకటస్వామి, నల్లా సత్యనారాయణమూర్తి, దేవపాటి సత్యనారాయణ, చీకట్ల రామారావు, పప్పుల సుబ్బారావు, ముత్యాల రామం, భమిడిపాటి వెంకటేశ్వర్లు, అన్యం శ్రీరాములు, కొంబత్తుల విష్ణుమూర్తి, చోడపనీడి వెంకట్రావు యర్రంశెట్టి చినరామన్న, మారిశెట్టి సత్యనారాయణ, గుత్తుల మునలయ్య, దొడ్డా వీరాస్వామి తదితర 15 మంది వరకూ ఉత్తమ క్రీడాకారులు రాణించారు. పలువురు రాష్ట్ర స్థాయిలో కొందరు జాతీయ స్థాయిలో క్రీడా ప్రతిభను చాటారు. కప్స్, వివిధ మెడల్స్ సాధించడం ద్వారా కొత్తపేటకు కీర్తిప్రతిష్టలు తీసుకువచ్చారు. వారిలో చీకట్ల రామారావు, పప్పుల సుబ్బారావు, ముత్యాల రామం మినహా మిగిలిన వారు వ్యాయామ ఉపాధ్యాయులు (పీఈటీలు) గా ఉద్యోగావకాశాలు పొంది ఎందరినో క్రీడాకారులను, పీఈటీలను తయారుచేశారు.

రెండవ తరంలో క్రీడాకారులు

పై తరం క్రీడాకారులు తరువాత రెండవ తరంలో ముత్యాల వీరభద్రరావు, ఎంపీ కృష్ణంరాజు, వాడ రామారావు, మిద్దే ఆదినారాయణ, మిద్దే శ్రీనివాస్, భమిడిపాటి పాపయ్యశాస్త్రి, భమిడిపాటి రామకృష్ణ, బళ్ల మల్లేశ్వరరావు తదితరులు వాలీబాల్, బాస్కెట్‌బాల్, క్రికెట్ ఆడేవారు. వారు ఆయా క్రీడలు ఆడుతుంటే క్రీడాభిమానులు, విద్యార్థులు ఎంతో ఆసక్తిగా తిలకించేవారు.

మూడో తరంలో క్రీడాకారులుగా, పీఈటీ, పీడీలుగా..

ప్రస్తుత మూడో తరంలో వైఎస్ఎస్ ఉషారాణి ఖోఖో క్రీడాకారిణిగా తన ప్రతిభను చాటారు. జాతీయ పోటీలకు రాష్ట్ర జట్టు కెప్టెన్‌గా వ్యవహరించారు. అలాగే ఎస్‌వీ రమణ, ఏఎస్ఎస్ రమాదేవి బాల్‌బ్యాడ్మింటన్ జాతీయ స్థాయిలో ఆడి పతకాలు సాధించారు. వారు ప్రస్తుతం వివిధ ఉన్నత పాఠశాలల పీడీలుగా పని చేస్తున్నారు. ఇంకా భమిడిపాటి అప్పాజీ, ముత్యాల పవన్‌కిషోర్, దాసరి నాగేశ్వరరావు, వైఎస్ఆర్, ఏ అనంతలక్ష్మి, ఎల్ పద్మిని, ఎల్ స్వాతి, దేవపాటి కళ్యాణి, నాగమల్లేశ్వరరావు, కే రఘుప్రియ తదితర సుమారు 20 మంది వివిధ క్రీడల్లో తమ ప్రతిభను చాటారు. ప్రస్తుతం పీడీ, పీఈటీలుగా ఉన్నారు. తాజాగా డీఎస్సీలో కంచెర్ల అయ్యప్ప, నెల్లి ప్రసన్న పీఈటీలుగా ఉద్యోగాలు పొందారు.

క్రీడా రంగంలో నల్లాకు ప్రత్యేక స్థానం



క్రీడల ప్రస్తావన వస్తే వెంటనే గుర్తుకు వచ్చే వ్యక్తి నల్లా సత్యనారాయణమూర్తి. ఆయన గొప్ప క్రీడాకారునిగా రాణిస్తూ 1954 లోపీఈటీగా ఉద్యోగంలో చేరారు. తరువాత బాస్కెట్‌బాల్‌కు సంబందించి మద్రాస్‌లో, హాకీకి నాగపూర్‌లో ప్రత్యేక శిక్షణ పొంది ఆయా క్రీడలకు కోచ్‌గా వ్యవహరించారు. ఏసీసీ, ఎన్‌సీసీ, స్కౌట్ ఆఫీసర్‌గా పనిచేశారు. ఆయన శిక్షణలో ఎందరో ఉత్తమ క్రీడాకారులుగా, మరెందరో పీఈటీలుగా తయారయ్యారు. 1990లో ఆయన పదవీ విరమణ చేయగా, ప్రస్తుతం 94 సంవత్సరాల వయసులో కూడా పీఈటీలకు సూచనలు, సలహాలు ఇస్తుంటారు. అలా ఈ రంగంలో ఆయన ప్రత్యేక స్థానం పొందారు.

ఫుట్‌బాల్ ప్లేయర్‌గా రాణించిన చీకట్ల



మండల పరిధిలోని వాడపాలెం గ్రామానికి చెందిన చీకట్ల రామారావు ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, రన్నింగ్‌లో జాతీయ స్థాయిలో ఆడినా ఫుట్‌బాల్ ప్లేయర్‌గా మంచి గుర్తింపు పొందారు. ఆయా క్రీడల్లో అనేక పతకాలు సాధించారు. ఆయన 1950 నుంచి 1965 వరకూ సుమారు 15 సంవత్సరాల పాటు క్రీడల్లో పాల్గొంటూ గొప్ప క్రీడాకారునిగా, ముఖ్యంగా ఫుట్‌బాల్ సెంటర్, బాస్కెట్‌బాల్ సెంటర్ ప్లేయర్‌గా ఆడారు. ఆయా క్రీడల సెలక్షన్ కమిటీ సభ్యుడిగా కూడా వ్యవహరించారు. ఆయన వయసు 90 కి చేరుకున్నా యువకునిలా ప్రతిరోజూ స్పోర్ట్స్ షూ వేసుకుని వాడపాలెం నుంచి కొత్తపేట రాకపోకలు వాకింగ్ చేస్తారు.

ఆసుపత్రిలో విద్యార్థికి పరామర్శ



రాజోలు ఆస్పత్రిలో బాధిత విద్యార్థిని పరామర్శిస్తున్న ప్రజా సంఘాల నాయకులు



రాజోలు ప్రభుత్వాస్పత్రిలో విన్సెంట్‌ను పరామర్శిస్తున్న మోహన్ కుమార్

సఖినేటిపల్లి: మోరంపూడి శ్రీచైతన్య హాస్టల్‌లో సహచర విద్యార్థుల ర్యాగింగ్‌కు గురై రాజోలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి గుర్రం విన్సెంట్ ప్రసాద్‌ను గురువారం సఖినేటిపల్లికి చెందిన ఎస్సీ, ఎస్టీ జిల్లా విజిలెన్స్, మానటరింగ్ కమిటీ మెంబర్ తాడి మోహన్‌కుమార్ పరామర్శించారు. అనంతరం ఆయన సఖినేటిపల్లిలో మాట్లాడుతూ, శంకరగుప్తంకు చెందిన హాస్టల్ విద్యార్థి విన్సెంట్ ప్రసాద్‌పై సహచర విద్యార్థులు పైశాచికత్వం, ఐరన్ బాక్స్‌తో పొట్టభాగం, చేతులపైన విచక్షణా రహితంగా వాతలు పెట్టిన ఘటన దారుణమన్నారు. నిర్లక్ష్యం వహించిన పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకునేలా తమ కమిటీ ద్వారా చూస్తామన్నారు.

రాజోలు: మోరంపూడి శ్రీ చైతన్య స్కూల్‌లో తోటి విద్యార్థులు కరెంట్ ఇస్త్రీ పెట్టె వాతలు పెట్టడడంతో చికిత్స పొందుతున్న బాధిత విద్యార్థి గుర్రం విన్సెంట్ ప్రసాద్‌ను గురువారం ప్రజా సంఘాల నాయకులు పరామర్శించారు. మైనర్ బాలుడిపై దాడికి పాల్పడిన సహచర విద్యార్థులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మానవ హక్కుల వేదిక జిల్లా కార్యవర్గ సభ్యుడు ముత్యాల శ్రీనివాసరావు, దళిత బహుజన మహిళా శక్తి జాతీయ కన్వీనర్ కొంకి రాజామణి, నాయకులు చెవ్వాకుల వెంకట్, కడలి లక్ష్మి, భూపతి ప్రమీల, ఎస్.రమేష్ పాల్గొన్నారు.

మాతృభాషను అందరూ గౌరవించాలి



సంధిపూడిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల బాల ఉపాధ్యాయులు

ఆలమూరు: మాతృభాషను అందరూ గౌరవించడం ద్వారా తెలుగుజాతి కీర్తి ప్రతిష్టలు ప్రపంచం నలుమూలల వ్యాప్తి చెందించవచ్చని మండల విద్యాశాఖాధికారి భమిడిపాటి అప్పాజీ అన్నారు. సంధిపూడిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల మందిరం వ్యవస్థాపక అధ్యక్షులు కృష్ణశ్రీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ అప్పాజీ, సర్పంచ్ తోట భవాని, సీనియర్ టీడీపీ నేత దొడ్డా సుబ్బారావు పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఈసందర్భంగా ప్రముఖ సాహితీవేత్త గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కథల పోటీల్లో విజేతలైన 14 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు ఎమ్‌వివిఎస్ ఎస్.మూర్తి, ఉపాధ్యాయులు శ్రీనివాస కృష్ణ, ప్రసూన, సత్యవతి, సుజాత, ప్రసాదరాజు, మాధవి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుడిని దర్శించిన ప్రముఖులు



స్వామివారిని దర్శించుకుంటున్న అమరావతి హైకోర్టు న్యాయమూర్తి హరిహరనాథ్ శర్మ దంపతులు

అయినవిల్లి: నవరాత్రి మహోత్సవాలు సందర్భంగా అమరావతి హైకోర్టు న్యాయమూర్తి ఎ.హరిహరనాథ్ శర్మ దంపతులు, బీఆర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ దంపతులు, జేసీ టి.నిశాంతి, కొత్తపేట ఆర్డీఓ పి.శ్రీకర్ దంపతులు, స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తదితరులు స్వామివారి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ ప్రధానార్చకులు మాచరి వినాయకరావు, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అల్లు వెంకట దుర్గభవాని ఘన స్వాగతం పలికారు. వీరికి ఆలయ వేదపండితులు ఆశీర్వదించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

గణేశ్ ఉత్సవ కమిటీలు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి

కొత్తపేట: గణపతి నవరాత్ర ఉత్సవాల్లో ఎక్కడ ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవ కమిటీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ వై రాంబాబు, రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ సూచించారు. గురువారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద మండల పరిధిలోని గ్రామాల్లో కమిటీలతో ప్రభుత్వ శాఖల అధికారులు వివిధ అంశాలపై సమీక్షించారు. మండపాల వద్ద విద్యుత్ సెట్టింగులు, లైటింగ్ ఏర్పాట్లు వలన షార్ట్ సర్క్యూట్ జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ఏవిధమైన గొడవలకు తావు లేకుండా కార్యక్రమాలు నిర్వహించాలనిహెచ్చరించారు. ఎస్సై సురేంద్ర, విద్యుత్, అగ్నిమాపక శాఖల అధికారులు పాల్గొన్నారు.

జగన్‌పై నిందలు వేయడం దుర్మార్గపు చర్య

అయినవిల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ డైరెక్షన్‌లో బొమ్మినీ తిమ్మినీ చేయడంలో బహు దిట్టా అయిన వీరు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నిందలు వేయడం దుర్మార్గపు చర్య అని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్ అన్నారు. ఈ సందర్భంగా గురువారం సిరిపల్లిలోని ఆయన స్వగృహంలో స్థానిక విలేకరుతో మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే నిధులు, ఇతర అంశాలపై రాష్ట్ర ప్రజలకు తెలుసని, కేంద్రా ప్రభుత్వ నిబంధనల 15వ ఆర్థిక సంఘం నిధులు రెండు భాగాలుగా రెండు విడతల్లో గ్రామ పంచాయతీలకు జమ చేయాల్సి ఉందన్నారు. వాటిలో మొదటి విడత నిధులు ఏప్రిల్ నుంచి జూన్‌లో, రెండోవ విడత నిధులు అక్టోబర్ నుంచి డిసెంబర్ నెలలో జమ చేయాల్సి ఉందన్నారు. కానీ ఆర్థిక సం 2024-25కిగాను రెండోవ విడత, 2025-26 కిగాను మొదటి విడత నిధులు ఇప్పటికీ జమ చేయలేదన్నారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంవత్సరం 2025-26కి గాను రావల్సిన రెండోవ విడత నిధులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రామ పంచాయతీలకు మొదటి విడతగా జమ చేసిన నిధులకు సంబంధించిన యూటిలైజేషన్ సర్టిఫికెట్ కోరానున్న నేపథ్యంలో గ్రామ పంచాయతీలకు రావల్సిన బకాయిలు వచ్చే నెలలో జమ చేస్తామన్నారు. పంచాయతీ నిధులన్నీ దారి మళ్లించి ఏదో కొత్తగా ఇస్తున్నట్టు ప్రభుత్వం మాట్లాడం చాలా హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వమా, కేంద్ర ప్రభుత్వం అనేది చెప్పాలని డిమాండ్ చేశారు. ఇంకా గత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపైన ఆ ప్రభుత్వం మీద నిందలు వేయడం తగదని ఆయన హితవు పలికారు.

విఘ్నాలు తొలగించు వినాయకా..

- ఘనంగా గణపతి నవరాత్ర ఉత్సవాల ప్రారంభం
- వాడవాడలా వెలసిన మండపాలు
- గ్రామాల్లో నెలకొన్న సందడి



ఆలమూరులో ఆకట్టుకున్న 12 అడుగుల మట్టి గణపతి విగ్రహం



పెదపట్నంలంకలో మట్టి విగ్రహాన్ని దర్శించుకుంటున్న భక్తులు

కొత్తపేట: విఘ్నాలు తొలగించే వినాయక చవితి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గణపతి నవరాత్ర ఉత్సవాలు నిర్వహించేందుకు వీధికో మంటపం వెలసింది. అందులో కొలువైన గణేశునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నైవేద్యాలు సమర్పించారు. కూడళ్లలో వెలసిన గణపతి మంటపాల వద్ద వేసిన పందెళ్లు, విద్యుద్దీపాలంకరణతో గ్రామాలన్నీ కళకళలాడుతున్నాయి. రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట నియోజకవర్గాల్లోని మండల కేంద్రాలు, ప్రధాన గ్రామాలు, కూడళ్ల వద్ద, సిద్ధి వినాయక ఆలయాలతోపాటు ప్రత్యేక మంటపాల్లో గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. కొత్తపేటలోని కళానగర్ సిద్ధి వినాయక స్వామివారి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ గాలిదేవర పుల్లయ్యనాయుడు, సభ్యులు, ప్రధాన అర్చకుడు పుల్లాపంతుల విజయకుమార్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, గణపతి హోమం, విశేష పూజలు నిర్వహించారు. మార్కెట్ వద్ద సిద్ధి వినాయకస్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు సలాది బ్రహ్మాజీ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. కొప్పిశెట్టివారి వీధి, సంతోష్‌నగర్, న్యూ బ్యాంక్ కాలనీ, గౌతమి నగర్, తదితర శివారు గ్రామాల్లో పూజలు జరిగాయి.

ఆత్రేయపురం మండలంలో

ఆత్రేయపురం మండల పరిధిలోని గ్రామాల్లో వినాయకస్వామి ఆలయాలు, ఉత్సవ పందిళ్లలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. దీనిలో భాగంగా ర్యాలి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వినాయక మండపాన్ని ఏర్పాటు చేసి, రూ.2 లక్షలు విలువైన కరెన్సీ నోట్లతో అలంకరించారు.

సఖినేటిపల్లిలో

సఖినేటిపల్లి: మండలంలో పలు గ్రామాల్లోని చవితి వేడుకల మండపాలలో కొలువు దీరిన వినాయకుని స్వామివారి సన్నిధిలో వైఎస్సార్ సీపీ రాజోలు ఇన్‌చార్జ్ గొల్లపల్లి సూర్యారావు పూజలు చేశారు. ఈ మేరకు సఖినేటిపల్లి క్షత్రియ కల్యాణ మండపంలో గ్రామస్తులు ప్రతిష్ఠించిన వినాయకుని విగ్రహం వద్ద, సఖినేటిపల్లి పాలెం సెంటర్లో నామనవారి గ్రూపు, మోరిపోడు ముప్పర్తివారి గ్రూపుల్లో ప్రతిష్ఠించిన వినాయకుని విగ్రహాల వద్ద గొల్లపల్లి పూజలు చేశారు.

ఆకట్టుకున్న 12 అడుగుల విగ్రహం

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణపతి మండపాల వద్ద నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలమూరులోని రథం వీధి సమీపంలో ఉన్న శ్రీవినాయకుని ఆలయంలో ప్రతిష్ఠించిన 12 అడుగుల మట్టి విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఆలయ కమిటీ ఈ మట్టి గణపతి విగ్రహాన్ని తయారు చేయించింది.

రాజోలు మండలంలో..

రాజోలు: స్థానిక ఆకుల వారి వీధిలో ఎస్ఆర్ఏ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ విగ్రహాన్ని పలువురు దర్శించుకున్నారు. ఎస్ఆర్ఎఫ్ యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన శివరూప వినాయకుని విగ్రహం చూపరులను ఆకట్టుకుంది. నాగార్జున స్ట్రీట్, రాజోలు మేకలపాలెం, కోళ్ల వారి వీధిలో ఏర్పాటు చేసి భారీ గణనాథుడి విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. తాటిపాక, పొదలాడ, వేగివారిపాలెం, కడలి, పాలగుమ్మి, బి.సావరం, శివకోడు, శివకోడుపాలెం, చింతలపల్లి, కూనవరం, ములికిపల్లి గ్రామాల్లో వినాయకుని విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు చేశారు.

మామిడికుదురు మండలంలో..

మామిడికుదురు: వినాయక చవితి వేడుకలు బుధవారం వాడవాడలా వైభవంగా నిర్వహించారు. మండల పరిధిలోని మామిడికుదురు, నగరం, మొగలికుదురు, పాశర్లపూడి, పెదపట్నం, గెద్దాడ, అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడిలంక, లూటుకుర్రు, ఆదుర్రు, మాకనపాలెం, కొమరాడ, ఈదరాడ, మగటపల్లి, గోగన్నమఠం, కర వాక గ్రామాలో వేడుకలు వైభవంగా జరిగాయి.

ఉయ్యాల గణపతి

పి.గన్నవరం: చాకలిపాలెం గ్రామంలో ఆర్బీ రోడ్డు పక్కన న్యాయవాది మొల్లేటి శ్రీనివాసరావు నివాసం వద్ద ఉయ్యాలలో కొలువుదీరిన వినాయక స్వామి భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నారు. వినాయకుని విగ్రహం చుట్టూ కొండపల్లి బొమ్మలతో బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. పి.గన్నవరంలోని గరుడేశ్వర స్వామి ఆలయం వద్ద ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పి.గన్నవరం, ఎల్.గన్నవరం, ముంగండ, మొండెపులంక, నాగుల్లంక, చాకలిపాలెం, యర్రంశెట్టివారిపాలెం తదితర గ్రామాల్లో వేడుకలు ఘనంగా ప్రారంభ మయ్యాయి.

వాడవాడలా కొలువైన గణనాథుడు

రావులపాలెం: మండలంలోని గ్రామాల్లో వినాయక ఆలయాలు చవితి గణనాథుని ఉత్సవాలతో అత్యంత సుందరంగా దర్శిమిస్తున్నాయి. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రావులపాలెంలోని ఆదిలక్ష్మినగర్, కొత్తకాలనీ, కాలవగట్టు, పలు చోట్ల ఏర్పాటు చేసిన వినాయక మండపాలను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కొత్తపేట కళానగర్ ఆలయంలో పూజలందుకుంటున్న మట్టి గణపతి విగ్రహం



రాజోలు ఆకుల వారి వీధిలో ఏర్పాటు చేసిన భారీ గణనాథుడు



రాజోలు ఎస్ఆర్ఎఫ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివరూప గణనాథుడు



క్షత్రియ కల్యాణ మండపంలో కొలువుదీరిన వినాయకుడికి పూజలు చేస్తున్న గొల్లపల్లి



పి.గన్నవరం మండలం చాకలిపాలెంలో ఊయలలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం

108 అరటి గెలలతో అలంకరణ



అంబాజీపేట: గ్రామ శివారు గంగలకుర్రు మలుపులో ఉన్న విజయగణపతి ఆలయాన్ని 108 అరటి గెలలతో సర్వాంగ సుందరంగా అలకరించారు. వినాయక చవితిని పురస్కరించుకొని స్థానిక ఆలయ కమిటీ అధ్వర్యంలో యువకులు కర్పూర, చక్కెరకేళీ, అమృతపాణి, పచ్చఅరటి చెట్లను గెలలతో గణపతి ఆలయానికి అలంకరించారు. ఈ సందర్భంగా వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గణపతి చేతిలో 50 కిలోల లడ్డూ

మామిడికుదురు: వినాయక చవితిని పురస్కరించుకుని మామిడికుదురు వాసంశెట్టివారిపాలెం శ్రీలక్ష్మీ గణపతి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం చేతిలో 50 కిలోల భారీ లడ్డూను ఏర్పాటు చేశారు. ఈ లడ్డూను వేలం వేసేది లేదని, అన్న సమారాధన రోజున భక్తులకు ఉచితంగా ప్రసాదంగా పంపిణీ చేస్తామని ఆలయ కమిటీ తెలిపింది.



మామిడికుదురులో గణపతి చేతిలో ఏర్పాటు చేసిన భారీ లడ్డూ



రావులపాలెం ఆదిలక్ష్మి నగర్‌లో వినాయకుడి పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం



పెదపళ్లలోని బాల గణపతి ఆలయంలో విశేషార్చన నిర్వహిస్తున్న భక్తులు

ఆలమూరు: పెదపళ్ళలో ఉన్న బాలగణపతి ఆలయంలో గురువారం గణపతి హోమం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. బాల గణపతిస్వామి ఉత్సవ విగ్రహానికి అభిషేకం, విశేషార్చన నిర్వహించారు. ఈసందర్భగా పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.